# మానవత్వపు మధురిమ

రైలు కూత వేసి ముందుకు కదిలింది. స్నేహితునికి వీడ్కోలు చెప్పి బయటకు వచ్చాడు వినయ్. బండి స్టార్ట్ చెయ్యబోతుంటే అప్పుడే హడావిడిగా వచ్చిందావిడ. ట్రైన్ వెళ్ళిపోతూ ఉండటాన్ని గమనించి అతని దగ్గరకు వెళ్ళి "హలో! మీరెవరో నాకు తెలియదు. అర్జంట్‌గా నేనా రైలు పట్టుకోవాలి. లేదంటే ఇంటర్వ్యూ మిస్ అయిపోతాను.. కాస్త లిఫ్ట్ ఇస్తారా?" అడిగిందావిడ. ఆలోచించే సమయం కూడా తీసుకోకుండా "ఎక్కండి మేడమ్!" అన్నాడు.

ఆవిడ ఎక్కుతూనే "అనవసరంగా మీకు శ్రమ ఇస్తున్నాను" అంది.

"ఫరవాలేదండీ.. ప్యాసింజరే కాబట్టి రెండు, మూడు, స్టేషన్‌లు దాటేలోపు అందుకోవచ్చు. మీరేం వర్రీ కాకండి"

"ఏమో బాబూ! నాకైతే టెన్షన్‌గానే ఉంది. పిల్లల భవిష్యత్తు నేనీ పొందబోయే జాబ్ మీదే ఆధారపడి ఉంది"

"మిమ్మల్ని అదే ట్రెయిన్ ఎక్కించే పూచీ నాది. ధైర్యంగా ఉండండి. జాగ్రత్తగా కూర్చున్నారు కదా! అసలే టెన్షన్‌లో ఉన్నారు"

"నువ్వు జాగ్రత్తగా డ్రైవ్ చెయ్యి బాబూ. నాకేం భయం లేదు"

దారిలో రైల్వేగేటు పడింది. అంటే రైలు వెళ్ళిపోయిందన్నమాట. గేటు ఎత్తగానే బయలుదేరటానికి రడీగా ఉన్నాడు అతను. ఆ పని జరగగానే దూసుకు వెళ్ళాడు. ఎవరో మోటార్ సైకిల్ రేస్ పెట్టినట్లుంది అతనికి.

"ఈ కాలంలో ఎవరు బాబూ ఇలా అడగగానే సహాయం చేసేది. నా పని అయిపోయిందనే అనుకున్నాను. ఎందుకో నిన్ను చూడగానే ఒక్కసారి అడగాలనిపించింది. ఎంతో మంచివాడివిలా అనిపించావు"

"భలేవారే! ఆపదలో ఉన్నవారిని ఆదుకోకపోతే ఎలా? మనకి మనం సహాయం చేసుకోకపోతే ఇంకెవరు చేస్తారు? రోజుకొకరికయినా సహాయం చెయ్యాలన్నది నా పాలసీ. అది మా అమ్మ మాట కూడా!"

"అలాంటి అమ్మ కడుపున పుట్టావు కాబట్టే మానవత్వం చూపిస్తున్నావు. నువ్వెప్పుడూ ఇలాగే ఉండాలి"

"థ్యాంక్సండీ! స్టేషన్‌కి వచ్చేసాం. తప్పక ఇక్కడ రైలు కాచ్ చెయ్యొచ్చు" అంటూ బ్రేక్ వేసాడు. స్కూటర్‌కి స్టాండ్ వేస్తూనే "మీరు లోపలికి వెళ్ళండి" అన్నాడు.

ఇద్దరూ ఒకరి వెనక ఒకరు స్టేషన్‌లోకి ప్రవేశించారు.

కౌంటర్‌లోకి వెళ్ళి ట్రెయిన్ వివరాలు అడిగాడు వినయ్.



ఇంకా రాలేదు. రెండు నిముషాలలో వస్తుందని చెప్పాడు టిక్కెట్లు ఇచ్చేచోట. "అమ్మయ్యా!" అని అప్పుడు ఊపిరి పీల్చుకున్నాడతను.

రెండు నిముషాలలో రాలేదు కానీ అయిదు నిముషాలకు వచ్చింది. ఈలోపు ఆవిడ టిక్కెట్టు కొనుక్కుని వచ్చింది.

"నీ మేలు ఈ జన్మలో మరిచిపోను బాబూ!" అంది.

"భలేవారే" అన్నాడతను.

ఈలోపు ట్రెయిన్ రావటం, ఆవిడ ఎక్కటం జరిగిపోయాయి. టాటా చెప్పి బయటపడ్డాడు వినయ్.

అతనికి చాలా సంతృప్తిగా ఉంది. సమయానికి ఒకర్ని ఆదుకోగలిగానని.. ఇంటికి చేరాడు.

"ఏరా! ఈరోజు అరగంట ఆలస్యమయిందేం?" అడిగింది తల్లి అన్నానికి అన్నీ సర్దుతూనే.

"ఈరోజు ఓ తమాషా జరిగిందమ్మా. మన అరుణ్ ఊరు వెళుతున్నానంటే స్టేషన్‌కి వెళ్ళాను. వచ్చేస్తుంటే 'ఓ ఆవిడ అదే ట్రెయిన్‌లో వెళ్ళాల్సింది. మిస్సయ్యాను. కాస్త సాయం చెయ్యవా' అని అడిగింది. సరేనని ఆవిడను ఎక్కించుకొని, ఎలాగయితేనేం పదిహేను నిముషాలలో ఆ రైలును పట్టుకొని ఆవిడను దింపి మళ్ళీ ఇంటికి వచ్చేటప్పటికి ఈ వేళయింది"

చెబుతూనే లుంగీ మార్చుకొని కాళ్ళు కడుక్కొని వచ్చి కూర్చున్నాడు.

"మంచి పని చేసావురా వినయ్" మెచ్చుకుంది మనస్ఫూర్తిగా.

"పాపం ఆవిడకు ఉద్యోగం రాకపోతే పిల్లలతో చాలా బాధపడవలసి వచ్చేది అంది. ఆవిడ ఇంటర్వ్యూకి సమయానికి వెళ్ళాలికదా, వెళితే సెలక్ట్ అయిపోయినట్లే అన్నట్లు చెప్పింది" అన్నాడు.

"అదంతా జరిగితే మంచిదే. మనక్కావల్సింది ఆవిడ అడిగినప్పుడు సహాయపడటమే. మీ పిన్ని ఈరోజు ఏమందో తెలుసా? 'నువ్వు, నీ కొడుకు అడిగినవారికి అడగని వారికి సహాయం చేస్తుంటారుగా. డబ్బులు ఖర్చు తప్ప ఏంటి లాభమని?'"

ఒకటే మాట అన్నాను "మన మంచి ఎప్పుడూ మనకి, మన పిల్లలకి మంచే చేస్తుందని" అంతకంటే ఏం చెబుతాను?

★★★

కదిలిపోతున్న చెట్లను చూస్తూ కూర్చుంది కల్పన. ఉదయం జరిగిందంతా కళ్ళముందు కదిలింది. ఎప్పుడూ ఎవరో ఒకరిని భోజనానికి తీసుకురావటం, తను వండిపెట్టటం అలవాటయిపోయింది. పోనీ ఈయన చేసే మంచి పనిని హర్షించే హృదయం వాళ్ళకు ఉన్నట్లు అనిపించదు. అలాంటివాళ్ళకు సహాయం చెయ్యటం ఎందుకని తను. నిన్న అలాగే ఆఫీసులో అతని భార్య పుట్టింటికి వెళ్ళిందని తీసుకు వచ్చారు. వండి పెట్టి పంపించింది. మరి నేనెన్నిసార్లు వాళ్ళ ఇంటికి వెళ్ళాను. ఒక్కసారి కూడా అతను పిలవలేదని తన బాధ. అందుకు తన భర్త సమాధానం. "కల్పనా! ఒకరినుంచీ ఆశించి ఏమీ చేయకూడదు. సహాయం చెయ్యగలిగినంత చెయ్యాలంతే..భగవంతుడు ఎప్పుడూ దానిని ఏదో రూపంలో రెట్టింపుగా మనకే అందజేస్తాడు" అని.

నిజమే కదా! లేకపోతే ఆ అబ్బాయి లిఫ్ట్ ఇవ్వటం కలలో కూడా ఊహించనిదే. భర్త మాటల్లోని గూడార్థం కళ్ళకు కట్టినట్లయింది. మనస్సంతా తృప్తితో నిండిపోయింది. ఇకపైన ఎవరికీ సహాయం చేయటంలో ఆలోచించకూడదని మనసులో గట్టిగా నిశ్చయించుకుంది.

**-యలమర్తి అనూరాధ**
(పెనుగొండ)